సమగ్ర తెలుగు దినపత్రిక

# అడుగు

Website: www.adugunews.com

The Step Towards The Truth..

హైదరాబాద్ | ఆదివారం 12 జూలై 2026 | సంపుటి: 02 | సంచిక: 134 | పేజీలు: 4 | వెల: రూ.6:50

Published from Telangana, Andhra Pradesh | చీఫ్ ఎడిటర్: డాక్టర్ మార్గం లక్ష్మీనారాయణ | Mail: adugudaily@gmail.com

## బంధం మరింత బలోపేతం

**న్యూజిలాండ్ లో ప్రవాస భారతీయులతో మోదీ**

ఆక్లాండ్,జులై 1(అడుగు న్యూస్): భారత్-న్యూజిలాండ్ వాకా(బోటు) ఇప్పుడు నూతన ప్రయాణాన్ని ఆరంభిం చేందుకు సిద్ధంగా ఉందని, ఇరు దేశాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రయాణం మున్ముందు మరింత విజయవంతమవుతుందనే పూర్తి నమ్మకం తనకుందన్న మోదీ.. అది తనవల్ల కాదని, అందుకు న్యూజిలాండ్‌లోని భారతీయులే కారణమన్నారు. న్యూజిలాండ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ రెండో రోజు పర్యటన కొనసాగింది. శనివారం ఆక్లాండ్‌లో ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇరు దేశాల

మిగతా 3లో..

## యుద్ధం కాదు, శాంతే లక్ష్యం

**భద్రతకు ముప్పు వల్లే ఆపరేషన్ సిందూర్: రాజ్ నాథ్**

**అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి జాతికి అంకితం**

విశాఖపట్నం,జూలై11(అడుగు న్యూస్): భారత్ లక్ష్యం యుద్ధం కాదని, ప్రపంచ శాంతి, స్థిరత్వమే తమ విధానమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ యుద్ధం కాదని, భారత భద్రతకు ముప్పు వాటిల్లితే దేశం ఎలా స్పందిస్తుందో ప్రపంచానికి చూపించిన చర్య అని వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని, భారత్ వ్యతిరేక శక్తులకు అవసరమైన

మిగతా 3లో..

# నేలరాలిన సిరిమల్లె పువ్వు..



- 'అమృత' సం'గీత' జానకమ్మ మృతి
- వయోభారంతో మైసూరులో కన్నుమూత
- అమృత గాత్రం ఆగిపోయింది
- సంగీత సామ్రాజ్యం మూగబోయింది
- 9 ఏళ్ల నుండే నేపథ్య గాయనిగా ప్రయాణం
- ఉర్రూతలూగిన 6 తరాలు, 6 దశాబ్దాలు, 60వేల పాటలు
- జానకికి నాలుగుసార్లు జాతీయ పురస్కారం
- నేడు మైసూరులో అంత్య క్రియలు

**పదహారేళ్ల వయసు సినిమాలో ఆమె పాడిన 'సిరిమల్లె పువ్వా.. సిరిమల్లె పువ్వా' ఎంతటి సంచలనమో ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు. రేడియోలో జానకమ్మ పాట వస్తుందంటే చిన్నా పెద్దా తేడా లేకుండా చెవులు రిక్కించి వినేవారు. అయితే ఇప్పుడా గాత్రం మూగబోయింది. 60 ఏళ్ల పాటు తన గాత్రంతో భారతీయులను అలరించిన ఎస్ జానకి (88) శనివారం మృతి చెందారు. సిరిమల్లె పువ్వు నేలరాలినా.. ఆ పుష్పం వెదజల్లిన సువాసన అజరామరం. భారతీయ చలనచిత్ర సంగీత ప్రపంచంలో తన అమృత గాత్రంతో ఒక వెలుగు వెలిగిన దిగ్గజ గాయని ఎస్. జానకమ్మ స్వర ప్రయాణం అసాధారణమైనది.**

### జానకి మరణంపై ప్రముఖుల సంతాపం

ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన

హైదరాబాద్,జులై11(అడుగు న్యూస్): ప్రముఖ గాయని ఎస్. జానకి మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం

మిగతా 2లో..

మైసూరు,జులై 11(అడుగు న్యూస్): సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలు అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు.

మిగతా 2లో..



# నరమేధ ఉన్మాదం

**ఫోక్సో కేసు పెట్టారని ఆరుగురి హత్య**

- మైనర్ బాలిక, తల్లి, నానమ్మ...
- తన భార్య, ఇద్దరు కూతుళ్ళ ఊచకోత
- పెళ్ళై, పిల్లలుండీ.. బాలికపై కన్ను..
- వేధింపులు భరించలేకే ఫోక్సో కేసు
- అరెస్టు కాకుండానే బెయిలు
- ఆ అర్ధరాత్రే హత్యలు, నిందితుడు పరారీ
- పోలీసుల నిర్లక్ష్యం వల్లే ..స్థానికుల ఆందోళన
- బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా
- ఎస్ఐ సస్పెన్షన్...సీఐపై శాఖాపరమైన చర్యలు
- నిందితుడిని పట్టిస్తే, రూ.2 లక్షల బహుమానం

రంగారెడ్డి,జూలై11(అడుగు న్యూస్): రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో

మిగతా 3లో..

## పునరుద్ధరణ పూర్తయ్యాకే
# ఎత్తిపోతలు

**ఎత్తిపోయగలిగితే బ్యారేజీలెందుకు?**

- గేట్లు మూస్తేనే ఎత్తిపోతల సాధ్యం
- అలా మూస్తే కూలడం ఖాయం
- ఇది ఎన్డీఎస్ఏ హెచ్చరిక
- అయినా కేసీఆర్, హరీశ్, కేటీఆర్ ల రాద్ధాంతం
- ప్రాజెక్టును కూల్చాలనే కుట్రల కుయత్నం
- బీఆర్ఎస్ కు మద్దతుగా కిలాడీ కమిటీ
- ఆ కమిటీకి ఛైర్మన్ కేసీఆర్, సభ్యుడు హరీశ్ రావు
- అప్పటి అవినీతిలో ఆ ఇంజనీర్లకూ భాగస్వామ్యం
- ఆ గజదొంగల గుంపులో చేరిన ఈటల
- బ్యారేజీ మరమ్మతులు పూర్తయ్యాకే ఎత్తిపోతలు
- జలశక్తి శాఖను నుంచి అనుమతి తెస్తే అభ్యంతరం లేదు
- కాళేశ్వరం ఎత్తిపోతలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు



### ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు : కేటీఆర్

కావాలనే ఎత్తిపోయట్లే : హరీశ్ రావు



హైదరాబాద్,జులై11(అడుగు న్యూస్): ఇది కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2022 వరదల ఫోటోలు చూపి కన్నెపల్లి మునిగిందని అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకవైపు నీళ్లు లేక

మిగతా 3లో..

హైదరాబాద్,జులై11(అడుగు న్యూస్): కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల

మిగతా 3లో..

## బుల్లెట్ రైళ్ళ హబ్‌గా
# తెలంగాణ

- హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కారిడార్
- దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లలో 3 తెలంగాణకే
- దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ
- ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పూర్తి
- ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్లల్లో ముందంజ
- సెమీ కండక్టర్ రంగంలో నైపుణ్యాలకు కొరత
- యువత ఈ అవకాశాలు అందిపుచ్చుకోవాలి
- సాంకేతికతలో యువత పాత్రపై అశ్వినీ వైష్ణవ్



హైదరాబాద్,జులై 11(అడుగు న్యూస్): తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును

మిగతా 3లో..

### ఓటిటి సినిమాలకు కూడా సెన్సార్ షిప్

**తాజా పరిణామాలతో కేంద్రం యోచన**

న్యూఢిల్లీ,జూలై11 (అడుగు న్యూస్): భారతదేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక

మిగతా 2లో..

## ఇదేంటి 'సర్'!?

**'సర్' ప్రధాన ఉద్దేశం మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామా మార్పులు నమోదు చేయడం, నకిలీ నమోదులను తొలగించడం, ఓటరు జాబితాను మరింత విశ్వసనీయంగా రూపొందించడం. పీఎం., సీఎం నుంచి సాధారణ పౌరుడి వరకు ప్రతి ఒక్కరూ సవరణ ప్రక్రియలో పాల్గొనాల్సిందేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసిన నేపథ్యంలో, ప్రజల వద్దకు వెళ్లాల్సిన బీఎల్‌వోలు తమ బాధ్యతలను సమర్ధంగా నిర్వర్తిస్తున్నారా? ఓటరు నమోదు సవ్యంగా సాగుతోందా? ప్రవాస భారతీయుల మాటేమిటి? నకిలీ నమోదులు తొలగిపోతున్నాయా? ఎన్యూమరేషన్ గందరగోళం సంగతేంటి?**

**డా. మార్గం-అడుగు**

ఎడిటోరియల్ 2వ పేజీలో

### రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు

- టీజీఆర్‌పీడీసీఎల్‌కు గ్రీన్ సిగ్నల్
- సాగుకు ఉచిత విద్యుత్ కొనసాగింపు
- మోటర్లకు మీటర్లు బిగించవద్దని ఆదేశం
- నాలుగు నెలల తర్వాత కార్యకలాపాలు

హైదరాబాద్,జులై11(అడుగు న్యూస్): తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ టీజీఆర్‌పీడీసీఎల్‌కు విద్యుత్ నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈఆర్సీ ఆదేశాలతో రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు

మిగతా 2లో..

# జలసమాధి

- వియత్నాంలో ఘోర ప్రమాదం
- బోటు బోల్తా పడి 19మంది జలసమాధి
- పర్యాటకంలో పలువురు తెలుగువాళ్ళ మృతి
- మృతుల్లో కడప, మచిలీపట్నంలంకు చెందిన వారు
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ, హెల్ప్ లైన్ ఏర్పాటు
- ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



హనోయ్,జులై 1(అడుగు న్యూస్): వియత్నాంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు ఒక్కసారిగా తీవ్రమైన అలలకు బోల్తా పడింది.

మిగతా 2లో..

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## సంపాదకీయం
## మార్గం - అడుగు



# ఇదేంటి 'సర్'!?

ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా ఉంటే ఎన్నికల ప్రక్రియ అంత విశ్వసనీయంగా ఉంటుంది. అదే సమయంలో, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకుండా చూడటం ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత. ఈ నేపథ్యంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--సర్) ప్రక్రియ లక్ష్యం ప్రశంసనీయం. అయినప్పటికీ, అమలు తీరుపై అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బూత్ లెవల్ అధికారు (బీఎల్‌వో)ల పనితీరు, సాంకేతిక ఏర్పాట్లు, విదేశాల్లో ఉన్న ప్రవాసుల ఓటు హక్కు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలి.

హైదరాబాద్ వంటి మహానగరంలోనే అనేక గేటెడ్ కమ్యూనిటీల్లో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లిన ఆనవాళ్లు కనిపించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రజలను ప్రత్యక్షంగా కలవకుండా కేవలం ఫారాలు సమర్పించాలని విజ్ఞప్తులు చేయడం ద్వారా ఈ ప్రక్రియ లక్ష్యాన్ని పూర్తిగా సాధించడం కష్టమే. చివరి గడువు సమీపిస్తున్న నేపథ్యంలో డిజిటలైజేషన్ కోసం ముందుగానే ఫారాలు ఇవ్వాలని అధికారులు కోరుతుండగా, ప్రజల్లో మాత్రం ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదు. ఫారాల రూపకల్పన క్లిష్టంగా ఉందని, అవసరమైన పత్రాలపై కూడా స్పష్టత లేదని రాజకీయ పార్టీలు, పౌరసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చివరి రోజుల్లో సర్వర్ సమస్యలు, సాంకేతిక లోపాలు తలెత్తితే వేలాది మంది ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉంటుంది. రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధం. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి, ఒకటికి మించి ఓటరు నమోదులు చేసుకున్నట్లు తేలితే జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే ఈ నిబంధనలను అమలు చేయడంలో కూడా పారదర్శకత, సమన్వాయం అత్యంత కీలకం. ద్వంద్వ నమోదులను గుర్తించడం సులభమే అయినా, రెండు రాష్ట్రాల్లో ఉన్న నమోదులను గుర్తించడంలో భారత ఎన్నికల సంఘం సమన్వయం మరింత బలోపేతం కావాలి.

ప్రవాస భారతీయుల ఓటు హక్కు ఆందోళన కలిగిస్తోంది. భారత విదేశాంగశాఖ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 3.5 కోట్లకు పైగా భారతీయులు నివసిస్తున్నారు. వారిలో 90 లక్షల మంది గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. ఏపీ తెలంగాణల నుంచే 20 నుంచి 25 లక్షల మంది విదేశాల్లో ఉన్నారు. తెలంగాణలోని నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, నిర్మల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి, ప్రకాశం, కడప జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు గల్ఫ్ దేశాల్లో ఉన్నారు. హైదరాబాద్ పాతబస్తీతో పాటు అనేక పట్టణ నియోజకవర్గాల్లో కూడా వేలాది కుటుంబాలు విదేశీ ఉపాధిపై ఆధారపడ్డారు.

ప్రస్తుత చట్టం ప్రకారం విదేశాల్లో నివసిస్తున్న భారతీయులు తమ పాస్‌పోర్టులో ఉన్న చిరునామా ఆధారంగా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్న వారి సంఖ్య చాలా తక్కువ. చట్టపరమైన అవగాహన లేకపోవడం, పత్రాల్లో పేర్లు, వయస్సులో వ్యత్యాసాలు, రేషన్ కార్డు వంటి సంక్షేమ పథకాలపై అపోహలు, దూర ప్రాంతాల్లో కాన్సులర్ సేవలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి.

సర్ ప్రధాన ఉద్దేశం మరణించిన వారి పేర్లు తొలగించడం, చిరునామా మార్పులు నమోదు చేయడం, నకిలీ నమోదులను తొలగించడం, ఓటరు జాబితాను మరింత విశ్వసనీయంగా రూపొందించడం. పీఎం., సీఎం నుంచి సాధారణ పౌరుడి వరకు ప్రతి ఒక్కరూ సవరణ ప్రక్రియలో పాల్గొనాల్సిందేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసిన నేపథ్యంలో, ప్రజల వద్దకు వెళ్లాల్సిన బీఎల్‌వోలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారా? ఓటరు నమోదు సవ్యంగా సాగుతోందా? ప్రవాస భారతీయుల మాటేమిటి? నకిలీ నమోదులు తొలగిపోతున్నాయా? ఎన్యూమరేషన్ గందరగోళం సంగతేంటి?

డిజిటల్ విధానాలపై పూర్తిగా ఆధారపడటం గ్రామీణులు, నిరక్షరాస్యులు, వృద్ధులు, వలస కార్మికులకు ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది. అందువల్ల ఇంటింటి ధృవీకరణ, హెల్ప్ డెస్క్ లు, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ప్రవాస భారతీయుల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు, బహుభాషా సమాచార వ్యవస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రవాస సంఘాలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలి.

ఓటు హక్కు కేవలం రాజ్యాంగం ప్రసాదించిన హక్కు మాత్రమే కాదు. పౌరుడి భాగస్వామ్యానికి ప్రతీక. అందుకే సవరణ పేరుతో అర్హులైన ఓటర్లు అనుకోకుండానైనా సరే, జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం వ్యవహరించాలి. విదేశాల్లో ఉపాధి కోసం వెళ్ళిన లక్షలాది తెలుగు ప్రవాసుల హక్కులను పరిరక్షించేలా స్పష్టమైన విధానాలు, సమర్థవంతమైన అమలు, పారదర్శక వ్యవస్థను రూపొందించడం అత్యవసరం. అప్పుడు మాత్రమే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ తన అసలు లక్ష్యాన్ని నెరవేర్చినట్లవుతుంది. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.

# నేలరాలిన సిరిమల్లె పువ్వు..

మొదటిపేజీ తరువాయి..

ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు. ఎస్ జానకి మృతితో భారతీయ సంగీత ప్రపంచంలో ఓ సువర్ణ అధ్యాయానికి ముగింపు పడిందని చెప్పవచ్చు. ఏప్రిల్ 23, 1938న అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీ (ప్రస్తుత ఆంధ్రప్రదేశ్)లోని గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా పల్లపట్ల గ్రామంలో ఎస్ జానకి జన్మించారు. ఆమె తండ్రి శిష్టా శ్రీరామమూర్తి ఆయుర్వేద వైద్యునిగా, అలాగే ఉపాధ్యాయునిగా సేవలు అందించారు. జానకి బాల్యం సిరిసిల్లలో గడిచింది. తొమ్మిదేళ్ల వయసులో మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. అందరి ముందు సింగింగ్‌లో తన ప్రతిభ చాటారు. ఆ తర్వాత నాదస్వర విద్వాంసులు పైడిస్వామి దగ్గర సంగీతంలో ప్రాథమిక పాఠాలు అభ్యసించారు. అయితే... శాస్త్రీయ సంగీతంలో ఎవరి దగ్గర శిక్షణ తీసుకోలేదు. తమిళ సినిమా 'విధియిన్ విలయాత్తు' (1957)తో 19 ఏళ్ల వయసులో నేపథ్య గాయనిగా జానకి ప్రయాణం ప్రారంభమైంది. అక్కడ నుంచి ఆవిడ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు. సుమారు ఆరు దశాబ్దాల పాటు సాగిన ఎన్నో అద్భుతమైన పాటలను శ్రోతలకు అందించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ తదితర భాషల్లో



సుమారు 48 వేలకు పైగా పాటలను ఆలపించారు.ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జానకి కాంబినేషన్ పాటలు ఎవర్ గ్రీన్ హిట్స్. వాళ్లిద్దరూ కలిసి వేలాది పాటలు ఆలపించారు. అవన్నీ అజరామరంగా నిలిచాయి. సుమారు ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్ తర్వాత 2016లో రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇకపై పాటలు పాడానని చెప్పారు. అయితే... 2018లో తమిళ సినిమా 'పన్నాడి'లో తన చివరి పాటను పాడారు. జానకి గాత్రంలో మాధుర్యానికి నాలుగుసార్లు జాతీయ పురస్కారం లభించింది. ఇక రాష్ట్ర పురస్కారాల సంగతి అయితే చెప్పాల్సిన అవసరం లేదు. వివిధ రాష్ట్రాల నుంచి 33 అవార్డులు లభించాయి. భారత ప్రభుత్వం 2013లో పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించగా... జానకి తీసుకోవడానికి నిరాకరించారు. సంగీత, చిత్రసీమకు తాను చేసిన సేవలకు అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' రావాలని పేర్కొన్నారు. జానకి కుటుంబ సభ్యుల విషయానికి వస్తే... 959లో వి. రామ్ ప్రసాద్‌తో జానకి వివాహం జరిగింది. ఆయన 1997లో గుండెపోటుతో మరణించారు.

జానకి అసలు పేరు శిష్టా శ్రీరామమూర్తి జానకి. 1938 ఏప్రిల్ గుంటూరు జిల్లా, రేపల్లె తాలూకా, పల్లపట్ల గ్రామంలో శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జన్మించారు. జానకి తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయుడు, ఆయుర్వేద వైద్యుడు. ఉద్యోగ రీత్యా ఈయన కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవారు. చాలాకాలం పాటు ఆమె సిరిసిల్లలోనే పెరిగారు. ఆవిడ 60 ఏళ్ల సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడారు. వీటిలో మలయాళం, కన్నడ భాషలలో పాడినవే ఎక్కువ. ఆమె ఉత్తమ గాయనిగా 4 సార్లు జాతీయ పురస్కారం పొందారు. వివిధ రాష్ట్రాల నుంచి 31 సార్లు అవార్డులు అందుకున్నారు. 12సార్లు నంది అవార్డులు అందుకున్నారు.ఇళయరాజా సంగీత దర్శకత్వంలో పాడిన పాటలు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలసి పాడిన పాటలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. మైసూరు విశ్వవిద్యాలయం నుండి జానకమ్మ గౌరవ డాక్టరేట్ పొందారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి కలైమామణి పురస్కారం పొందారు. దక్షిణ భారత కళాకారులకు సరియైన గుర్తింపు లభించడం లేదని 2013లో భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మ భూషణ్ పురస్కారాన్ని ఈ మహాగాయని తిరస్కరించారు.

1957లో విధియిన్ విలయాట్టు అనే తమిళ సినిమాతో తన కెరీర్ ను ప్రారంభించిన జానకి సెప్టెంబరు 2016 న తాను పాడటం ఆపేస్తున్నట్లు ప్రకటించారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె తాలుకా పల్లపట్ల గ్రామంలో శ్రీరామమూర్తి, సత్యవతి దంపతులకు జానకి జన్మించారు. జానకి తండ్రి శ్రీరామమూర్తి ఉపాధ్యాయుడు, ఆయుర్వేద వైద్యుడు. ఉద్యోగ రీత్యా ఆయన కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఉండేవారు. చిన్నతనం నుంచి జానకి సంగీతం పట్ల ఎంతో మక్కువ చూపేవారు. తన మూడవ ఏట నుంచే అనేక కార్యక్రమాల్లో పాల్గొనడం మొదలుపెట్టారు. ఉద్దండులైన సంగీత విద్వాంసుల దగ్గర శిష్యరికం చేశారు. బాల్యంలోనే సినీ సంగీతం పట్ల ఆకర్షితులయ్యారు. లతా మంగేష్కర్, పి.సుశీల, జిక్కి, పి.లీల పాడిన పాటలు తన కార్యక్రమాల్లో పాడుతూ ఉండేవారు. నాదస్వర విద్వాన్ పైడిస్వామి దగ్గర సంగీతం నేర్చుకున్న జానకి తన 19వ ఏట, తన మామయ్య సలహా మేరకు, చెన్నైలోని స్టూడియోలో పాడటం ప్రారంభించారు. తొలినాళ్లలో ఏవీయం స్టూడియో గాయనిగా ఉండి, 1957లో టి.చలపతిరావు సంగీత దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రం విధియిన్ విలాయత్తులో తన గాత్రాన్ని అందించడంలో, జానకమ్మ సినీ ప్రస్థానం మొదలయ్యింది. ఎమ్మెల్యే చిత్రం ద్వారా తెలుగువాళ్లకు దగ్గరయ్యారు. ఈ చిత్రంలో పాటలు ఆమెకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. అలా సెలయేరులా మొదలైన ఆమె గానం... ఎన్నో మలుపులు తిరుగుతూ ఓ మహా సాగరంలా మారి తెలుగువాళ్లను మంత్రముగ్ధులను చేశాయి. ఈ గానకోకిల గాయని మాత్రమే కాదు... పాటల రచయిత, కర్ణాటక గాత్ర సంగీత విద్వాంసురాలు, సంగీత దర్శకురాలు కూడా. కృష్ణుడు, షిర్డీ సాయిబాబా భక్తురాలైన ఆమె నిత్యం పూజల్లో మునిగితేలేవాళ్లు. అంతేకాక మీరాబాయిపై అనేక భక్తిగీతాల క్యాసెట్ల రికార్డు చేసి విడుదల చేశారు. ఉషా కిరణ్ మూవీస్ వారి మౌన పోరాటం చిత్రానికి సంగీత దర్శకత్వం వహించి, భానుమతి, లీల తర్వాత మూడో మహిళా సంగీత దర్శకురాలిగా పేరు తెచ్చుకున్నారు. పాటల్లో మిమిక్రి మిక్స్ చేసి సంగీతప్రపంచాన్ని మెప్పించారు. పదహారేళ్ళ వయసు చిత్రంలోని కట్టుకథలు చెప్పి నేను కవ్విస్తే పాటలో పండు ముసలావిడ గొంతు, గోవుల్లు తెల్లన గోపయ్య నల్లన పాటలో చిన్న పిల్లాడి గొంతు, పెద్ద వాళ్ళ స్వరంతో పాటు చిన్నారి పొన్నారి కిట్టయ్య పాటలో పిల్లాడి గొంతుతో పాటలు పాడారు. శ్రీవారి శోభనం చిత్రంలోని అలకపానుపు ఎక్కనేల చిలిపి గోరింక పాటలో హీరోయిన్, బామ్మ గొంతులతో పాట పాడడం ఆమె గాన వైవిధ్యానికి ఉదాహరణలు. మేఘమా దేహమా పాటలో ఆమె గొంతు పలికిన ఆర్ద్రత, ఆకాశం ఏనాటిదో అనురాగం ఆనాటిది అంటూ సాగే పాటలో ఆమె స్వరం పలికిన ప్రేమ తత్వం, వెన్నెల్లో గోదావరి అందం పాటలో ఆమె గొంతులో పలికించిన ఆవేదన, తొలిసారి మిమ్మల్ని చూసింది అంటూ సాగే పాటలో ఆమె స్వరంలో ప్రతిఫలించిన అల్లరి ఆమె భావ వైవిధ్యానికి తార్కాణాలు. అలనాటి జమున నుంచి నిన్నమొన్నటి హీరోయిన్ల వరకూ ఐదు తరాల హీరోయిన్లకి ఆలంబన అయింది. తెరముందు కనిపించే హీరోయిన్లకి ఆమె స్వరం అతికినట్టు సరిపోతుంది. ఈమె 55 ఏళ్ళ సుదీర్ఘకాలం పాటు సుమారు ఐదారు తరాల కథానాయికలకి అన్ని రకాల భావాలనూ స్పష్టంగా వ్యక్తీకరిస్తూ నేపథ్యగానం చేసింది. వయసు మీదపడినా ఆ ప్రభావం గొంతుమీద పడనివ్వకపోవడం ఆమె గానశైలి. మధురమైన సంగీతం, తిరుగులేని స్వరసంపదతో జానకి కెరీర్ ఎదురులేకుండా సాగింది. హిందీ, సింహళం, బెంగాలి, ఒరియా, ఇంగ్లీషు, సంస్కృతం, తుళు, సౌరాష్ట్ర, జపనీస్, జర్మన్ భాషలు తెలిసిన జానకి.... ఘంటసాల, డాక్టర్ రాజ్‌కుమార్, వాణి జయరాం, కె.జె. జేసుదాస్, ఎల్.ఆర్. ఈశ్వరి, పి. జయ చంద్రన్, పి.లీలా, కె.ఎస్. చిత్ర, సుజాత, జెన్సీ, పి.బి. శ్రీనివాస్, ఇళయరాజా, ఎస్.బి. బాలసుబ్రహ్మణ్యం వంటి పలువురు ప్రముఖ గాయకులతో పనిచేసింది. వి.రామ్‌ప్రసాద్‌ను వివాహమాడిన జానకి చెన్నైలో స్థిరపడ్డారు. రామ్‌ప్రసాద్ 1990లలో మరణించారు. ఆవిడకు మురళీకృష్ణ అనే ఏకైక కుమారుడు ఉన్నారు. ఈయన భరతనాట్యంలో ప్రవీణుడు. తెలుగు, మలయాళ సినిమాల్లో నటించాడు. తెలుగులో వినాయకుడు, మల్లెపువ్వు అనే చిత్రాల్లో నటించారు. మురళీకృష్ణ, ఈ ఏడాది జనవరి 22న మరణించారు. కొద్ది రోజుల క్రితం అమెరికాలో తన మనవడు చనిపోవడంతో జానకమ్మ తీవ్ర మానసిక ఆవేదనకు లోనయ్యారు.

## జానకి మరణంపై ప్రముఖుల సంతాపం

మొదటిపేజీ తరువాయి..

వ్యక్తం చేశారు. దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచంలో జానకి తన గళమాధుర్యంతో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. అనేక చిత్రాల్లో పాత్ర సన్నివేశాలకు, సందర్భాలకు అనుగుణంగా నవరసాలను పలికిస్తూ పాడిన పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేశాయని పేర్కొన్నారు. వారు తెలుగు వారు కావడం తెలుగు ప్రజలకు గర్వకారణమని పేర్కొన్నారు. తెలుగు, తమిళం, హిందీతో పాటుగా మొత్తం 17 భాషల్లో 50 వేలకు పైగా పాటలు పాడి ఎన్నో జాతీయ పురస్కారాలు అందుకున్నారని గుర్తుచేశారు. జానకమ్మ గారి మరణం భారతీయ చలన చిత్ర పరిశ్రమకే కాకుండా కోట్లాది సంగీతాభిమానులకు తీరని లోటు అని పేర్కొన్నారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ జానకి గారు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా జానకి మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. "దక్షిణాది గానకోకిల, పద్మభూషణ్ గ్రహీత (తిరస్కరించినప్పటికీ గౌరవించబడే) ఎస్. జానకి అమ్మగారి మరణవార్త మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. తెలుగు నేల కన్న గర్వకారణమైన కుమార్తె జానకమ్మ. ఆమె ఆరు దశాబ్దాల పాటు సాగించిన స్వర ప్రయాణం భారతీయ చలనచిత్ర సంగీత చరిత్రలో సాటిలేని ఒక అద్భుతమైన వారసత్వాన్ని నిర్మించింది. తన అమృత గాత్రంతో తరతరాల శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన ఆమె పాటలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయి. భారతీయ చలనచిత్ర సంగీతానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలు మరియు ఘనతలు శాశ్వతంగా గుర్తింపబడతాయి. ఈ కష్టసమయంలో ఆమె కుటుంబ సభ్యులకు, కోట్లాది మంది అభిమానులకు, మరియు యావత్ సంగీత ప్రపంచానికి మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాము. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము." అంటూ ట్వీట్ చేశారు.

ఇక మెగాస్టర్ చిరంజీవి కూడా ఎక్స్ ద్వారా జానకి మృతికి సంతాపం తెలిపారు. 'జానకమ్మ గారి మరణవార్త నా హృదయాన్ని ఎంతో కలచివేసింది. నా సినీ ప్రయాణంలో ఎన్నో మరపురాని పాటలకు ఆమె తన అపురూపమైన గాత్రాన్ని అందించారు. మేము తెరపై పలికించిన ఎన్నో భావోద్వేగాలకు ప్రాణం పోసింది ఆమె స్వరమే.నా కెరీర్‌లో ప్రేక్షకులు ప్రేమగా గుర్తుంచుకున్న ఎన్నో పాటల వెనుక జానకమ్మ గారి మధుర గాత్రం ఉంది. ఆ పాటలు వినిపించిన ప్రతిసారీ, ఆ రోజులు... ఆ జ్ఞాపకాలు... మళ్లీ కళ్లముందు సజీవంగా నిలుస్తాయి. జానకమ్మ గారు ఒక గాయని మాత్రమే కాదు... భావాన్ని స్వరంగా మార్చిన అసాధారణ కళాకారిణి. ఆమె పాడిన ప్రతి పాట ఒక జ్ఞాపకం... ఒక అనుభూతి... ఒక జీవితకాలపు అనుబంధం. ఈ రోజు మనం సంగీత ప్రపంచంలోని ఓ మహోన్నత శిఖరాన్ని కోల్పోయాం. కానీ ఆమె గానం ఎన్నో తరాలకు స్ఫూర్తిగా, మన జీవితాలకు నేపథ్య సంగీతంగా చిరకాలం మార్మోగుతూనే ఉంటుంది. శ్రీమతి ఎస్. జానకి గారి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు, ఆమెను అభిమానించే కోట్లాది సంగీతాభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. జానకమ్మ గారు... మీ స్వరం ఎప్పటికీ అమరం. ఓం శాంతి.' అంటూ సానుభూతి తెలిపారు. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా జానకి మృతిపై స్పందించారు. 'ప్రముఖ గాయని ఎస్ జానకి గారి మరణవార్త ఎంతో బాధాకరం! తన మధురమైన గాత్రంతో నవరసాలు పండించగలిగే దిగ్గజ గాయని ఎస్ జానకి గారు. సుమారు ఆరు దశాబ్దాల పాటు, వివిధ భారతీయ భాషల్లో కొన్ని వేల పాటలు పాడి భారతీయులను అలరించారు.జానకి గారు తన బాల్యంలో కొన్నేళ్లు నేను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో నివాసం ఉన్నారు. జానకి గారి మరణం సంగీత ప్రపంచానికి, భారతదేశ చలనచిత్ర రంగానికి తీరని లోటు. వారు భౌతికంగా మనకు దూరమైనా, వారి పాటలు సదా మనల్ని అలరిస్తూనే ఉంటాయి. ఎస్ జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అంటూ నివాళులు అర్పించారు.

## రాష్ట్రంలో మూడో డిస్కం సేవలు

మొదటిపేజీ తరువాయి..

అందుబాటులోకి వచ్చాయి. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను యథావిధిగా కొనసాగించాలని, మోటర్లకు మీటర్లు బిగించవద్దు అని కమిషన్ ఆదేశించింది. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో మూడో డిస్కం ఆవిర్భవించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్)కు విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) లైసెన్సును జారీచేసింది. తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్‌పీడీసీఎల్)కు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) విద్యుత్ పంపిణీ లైసెన్స్ మంజూరు చేసింది. ఉగాది పర్వదినం అయిన మార్చ్ 19న టీజీఆర్‌పీడీసీఎల్ లైసెన్స్ కోసం టీజీఆర్సీకి దరఖాస్తు చేసింది. ఈ లైసెన్స్ దరఖాస్తు పై మే 29న ఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించింది. బహిరంగ విచారణలో ఈఆర్సీ రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు, వినియోగదారుల సంస్థలు, విద్యుత్ రంగ నిపుణులు తమ అభ్యంతరాలు, సూచనలను పరిశీలించి, అందిన అన్ని అభిప్రాయాలను అంశాల వారీగా పరిగణనలోకి తీసుకుని కమిషన్ తన ఉత్తర్వుల్లో సమాధానాలు ఇచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొత్త డిస్కం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, మిషన్ భగీరథ, సంయుక్త రక్షిత తాగునీటి పథకాలు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ), ప్రత్యేక పంపిణీ ట్రాన్స్ఫార్మర్ల ద్వారా విద్యుత్ పొందుతున్న మున్సిపల్ తాగునీటి కనెక్షన్లకు సేవలు అందిస్తుంది. ఈ ఉత్తర్వు తేదీ నుంచి నాలుగు నెలల తర్వాత టీజీఆర్ పీడీసీఎల్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభమవ్వాలని కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టంలోని సెక్షన్ 131 ప్రకారం చట్టబద్ధమైన ట్రాన్స్ఫర్ స్కీమ్‌ను జారీ చేసిన తర్వాతే టీజీఆర్‌పీడీసీఎల్ లైసెన్స్ అమల్లోకి వస్తుంది. విద్యుత్ చట్టంలోని సెక్షన్ 18 ప్రకారం టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్ దాఖలు చేసిన దరఖాస్తులను కూడా కమిషన్ ఆమోదించింది. టీజీఆర్‌పీడీసీఎల్ కార్యకలాపాలు ప్రారంభమైన తేదీ నుంచి బదిలీ అయ్యే వినియోగదారుల వర్గాలను ఈ రెండు డిస్కంల పరిధి నుంచి తొలగిస్తూ వాటి లైసెన్సులను సవరించింది. మిగతా వినియోగదారులకు సేవలు అందించే బాధ్యతలు, భౌగోళిక పరిధిలో ఎలాంటి మార్పు ఉండదు.మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేలా కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్ 131 ప్రకారం ట్రాన్స్ఫర్ స్కీమ్ జారీ చేసి సంబంధిత ఆస్తులు, అప్పులు, వినియోగదారులను టీజీఆర్‌పీడీసీఎల్‌కు బదిలీ చేయాల్సి ఉంటుంది. అయితే 2027–28 టారిఫ్ ప్రతిపాదనలను ఈ ఏడాది నవంబర్ 30లోపు సమర్పించాలి. ఉద్యోగుల హక్కులు, సీనియారిటీ, పెన్షన్, రిజర్వేషన్ రోస్టర్, పదోన్నతి అవకాశాలకు ఎలాంటి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ స్పష్టం చేసింది.రాష్ట్రంలోని వ్యవసాయ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది. భవిష్యత్తులోనూ ఈ విధానంలో ఎలాంటి మార్పు ఉండదని ఈఆర్సీ స్పష్టం చేసింది. వ్యక్తిగత వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు ఏర్పాటు చేయబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని కూడా కమిషన్ ఉత్తర్వుల్లో నమోదు చేసింది. టీజీఆర్‌పీడీసీఎల్ కూడా ఇతర డిస్కంల మాదిరిగానే టారిఫ్, సేవా ప్రమాణాలు, వినియోగదారుల హక్కులు, నివేదికల సమర్పణ తదితర అన్ని అంశాల్లో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి పర్యవేక్షణలో పనిచేస్తుంది. మార్పిడి ప్రక్రియను కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైతే ప్రజాహిత దృష్ట్యా మరిన్ని ఆదేశాలు జారీ చేస్తుంది.

## ఓటిటి సినిమాలకు కూడా సెన్సార్ షిప్

మొదటిపేజీ తరువాయి..

రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్ వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# జలసమాధి

మొదటిపేజీ తరువాయి..

ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది తెలుగు పర్యాటకులు జలసమాధి అయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానిక అధికారులతో కలిసి నేవీ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత కాలమాన ప్రకారం ఉదయం 11: 30 గంటలకు బోటు ప్రమాదం జరిగినట్లుగా తెలుస్తోంది. ఓ మొబైల్ కంపెనీ తరపున డీలర్స్ టూరిస్ట్‌లుగా వెళ్లారు. ఏపీ నుంచి 30, తెలంగాణ నుంచి 45 మంది వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ కూడా లైఫ్ జాకెట్లు వేసుకోలేదని తెలుస్తోంది. ఇక మృతుల వివరాల కోసం అధికారులు హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబాలు కంట్రోల్ రూమ్‌లను సంప్రదించవచ్చని, ఎలాంటి సహాయానికైనా, సందేహాలకైనా తాము అందుబాటులో ఉన్నామని భారత మిషన్ తెలిపింది. మొత్తం బోటులో 75 మంది భారతీయులు ఉండగా.. ఎక్కువగా తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తమిళనాడు వాసులు చనిపోయినట్లుగా తెలుస్తోంది. అయితే వారి పూర్తి వివరాలు, స్వస్థలాలు, కుటుంబ సభ్యుల సమాచారం సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. భారత రాయబార కార్యాలయం కూడా వియత్నాం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. బోటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులా, సాంకేతిక లోపమా, లేక మరే ఇతర కారణమా అన్న కోణంలో అధికారులు విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ విషాద ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని బంధువులు, స్నేహితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం స్థానిక అధికారులు ఘటనా స్థలంలో ముమ్మరంగా గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్నది ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తాపడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం' అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటుచేసింది. ప్రమాద సమయంలో బోటులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 18 మంది మరణించినట్లు సమాచారం. కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కిషోర్ కుటుంబం కూడా ఈ విహారయాత్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కిషోర్ భార్య మరణించగా, అపస్మారక స్థితిలోకి వెళ్లిన కిషోర్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. స్థానిక అధికారుల సహాయక చర్యలు పూర్తిగా ముగిసిన అనంతరం ఈ వివరాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కడప జిల్లాకు చెందిన డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్, మచిలీపట్నంకు చెందిన జయశ్రీ మరణించారు. కడపకు చెందిన మరో డిస్ట్రిబ్యూటర్ నయీం ఒడ్డున ఉండటంతో ప్రాణాలు దక్కించుకున్నారు.

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..

## బిల్లా శివాని ట్రస్ట్ చేయూత!

రాయపర్తి, జూలై 11 (అడుగు న్యూస్):
వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం, పెరికేడు గ్రామంలో పేద విద్యార్థిని ప్రీతిక ఉన్నత చదువుల కోసం బిల్లా శివాని రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. పాలకుర్తి శాసనసభ్యురాలు యశశ్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు, ట్రస్ట్ చైర్మన్, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి-ఉషమ్మ దంపతులు శనివారం గ్రామాన్ని సందర్శించారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరమవ్వకూడదనే ఉద్దేశంతో, కీ.శే. అబ్బోజు వెంకన్న-పావని



దంపతుల కుమార్తె ప్రీతికకు రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నిరుపేద ఆడబిడ్డల ఉన్నత చదువులకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరికేడు గ్రామ సర్పంచ్ తీగల సాయిలు గౌడ్, వర్ధన్నపేట ఏఎంసి డైరెక్టర్ పుల్లూరి దామోదర్ గుప్తా, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్రప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి కుమార్, సీనియర్ నాయకులు సుతారి యాదగిరి, వల్లెపు యాదగిరి, ఎడ్లపెల్లి నరేందర్ రావు, వార్డు మెంబర్లు గారె సాయిలు, బండి వెంకన్న, సల్ల కొమరయ్య, పన్నీరు రాజ్ కుమార్, డా. రవి, బందు రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రొ. ప్రభంజన్ ప్రథమ వర్ధంతి సభ!

హైదరాబాద్, జూలై 11 (అడుగు న్యూస్):
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేంద్ర ప్రభుత్వ ఉన్నత ఉద్యోగానికి సైతం రాజీనామా చేసిన నిస్వార్థ ప్రజా నాయకుడు, బహుజన మేధావి అమరుడు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ ప్రథమ వర్ధంతి సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ సమావేశం ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమరయ్య హాల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామంలో జన్మించిన ప్రభంజన్ యాదవ్, విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహతో ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. ఢిల్లీ తెలంగాణ జేఏసీ కో-చైర్మన్‌గా సేవలు అందించడమే కాకుండా, మరణానంతరం తన భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల కోసం దానం చేసి చిరస్మరణీయుడిగా నిలిచారని, ఈ వర్ధంతి సభకు సభాధ్యక్షులుగా కోల జనార్ధన్, సమన్వయకర్తగా డాక్టర్ ఎం.ఏ. షోయబ్ వ్యవహరించనున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయన భార్య ప్రొఫెసర్ (డాక్టర్) గూడ రేఖ, కుమారులు విశ్వామిత్ర ఆర్. ప్రభంజన్, సత్యశోదక ఆర్. ప్రభంజన్, కుటుంబ సభ్యులు హాజరు అవుతున్నారని, బంధుమిత్రులు, సహచరులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయవలసిందిగా కార్యక్రమ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు : కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..**

రైతులు ఏడుస్తుంటే.. రేవంత్ రెడ్డి ఏమో మా మీద కోపంతో నీళు ఉన్నా కూడా ఇవ్వడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఎక్కడా నీళ్లు లేకపోయినా కన్నెపల్లిలో మాత్రం నీళ్లు ఉన్నాయని.. మేడిగడ్డను ముట్టకుండా కన్నెపల్లి నుండి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు అన్ని జలాశయాలు నింపొచ్చునని కేటీఆర్ వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక చూసి అయినా సోయి తెచ్చుకో రేవంత్ రెడ్డి అని కేటీఆర్ హితవు పలికారు. మేడిగడ్డ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుండి నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు అని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసింది. కన్నెపల్లి వద్ద ప్రస్తుతం 96.79 మీటర్ల నీళ్లు ప్రవహిస్తున్నాయి, కానీ 94 మీటర్లకే పంపులు ఆన్ చేయవచ్చు. మరో 100 రోజులు కన్నెపల్లి వద్ద ఇదే తరహా ప్రవాహం ఉంటుంది. 100 రోజుల్లో రోజుకి 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల లిఫ్ట్ చేస్తే, గోదావరి బేసిన్లో ఉన్న అన్ని రిజర్వాయర్లు నింపి సస్యశ్యామలం చేసే అవకాశం ఉందని ప్రభుత్వానికి రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిందన్నారు. మా మీద కక్షతో రైతుల నోట్లో మట్టి కొట్టకు.. కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేసే కుట్రలో రైతులకు నీళు ఇవ్వకుండా వాళ్లని ఆగం చేయకు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ కోరారు. గోదావరిలో కళ్ల ముందు లక్ష క్యూసెక్కుల నీళ్లు వరదలాగా కిందకి పోతుంటే అక్కడ ఎత్తిపోయడానికి నీళ్లు లేవు అన్నవాడు బుర్రతక్కువ వాడా..? లేదా రైతుల కోసం ఈ పని చేయమన్నోడు బుర్రతక్కువ వాడా..? అని కేటీఆర్ అన్నారు. కన్నెపల్లి వద్ద 93 మీటర్ల నుండే నీళ్లు ఎత్తిపోసే అవకాశం ఉంటే.. రాజకీయ ద్వేషంతో కళ్లు మూసుకున్న రేవంత్ రెడ్డి బుర్రతక్కువ వాడివో కాదో చెప్పాలన్నారు. అలాగే మేడిగడ్డ వద్ద 97 మీటర్ల ఎత్తులో నీళు పోతుంటే కళ్లు ఉండి చూడలేని నువ్వు బుర్రతక్కువ వాడివా.. లేదా వాస్తవాలు చూపించే మేము తెలివి లేనివాళ్లమో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకొని మేడిగడ్డ వల్ల మునిగిపోతుంది అంటున్న నీకు బుర్రలేదు.. అంటూ మండిపడ్డారు. రైతాంగం మొత్తం కన్నెపల్లి నుండి నీళ్లు ఇవ్వమంటే పట్టించుకోని వాడిని బుర్రతక్కువ వాడు అనాలా లుచ్చా అనాలా..? అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గురువు కోసం నీళ్లు కిందకి వదులుతున్నావా..? అని రైతులు అడిగితే దానికి సమాధానం చెప్పే దమ్ము లేని దద్దమ్మ అనాలా, దరిద్రుడు అనాలా, ఏమనాలో చెప్పాలని కేటీఆర్ అడిగారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది కాలం తెచ్చిన కరువు కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కుటిల బుద్ధితో తెచ్చిన కరువు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. గోదావరి నదిలో కావలసినన్ని నీళ్లు ఉన్నప్పటికీ, కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఈర్ష్యతో కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లను ప్రభుత్వం కావాలనే ఆన్ చేయడం లేదని విమర్శించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం తిమ్మాయ్ పల్లి గ్రామంలో జరిగిన పెద్దమ్మ దేవాలయ ఉత్సవాల్లో హరీష్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట జిల్లా పెద్దమ్మ తల్లి రేవంత్ రెడ్డికి సద్బుద్దిని ప్రసాదించాలని కోరుకున్నట్లు వెల్లడించారు. ఎంతటి కరవు వచ్చినా రైతాంగానికి నీరందించేలా కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, మోటార్లు ఆన్ చేస్తే రంగనాయక సాగర్ నిండి, సిద్దిపేట నియోజకవర్గంలోని దాదాపు 70 నుంచి 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. కాళేశ్వరంతో ఒక్క ఎకరం కూడా పండలేదని వెల్లడించిన ముఖ్యమంత్రి తిమ్మాయిపల్లి గ్రామానికి వచ్చి ప్రజలతో మాట్లాడితే అర్థమవుతుందని అన్నారు. తిమ్మాయిపల్లిలో తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కాళేశ్వరం జలాల రాకతో ఈ ప్రాంతం బంగారు పంటలతో కళకళలాడుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# పునరుద్ధరణ పూర్తయ్యాకే ఎత్తిపోతలు

**మొదటిపేజీ తరువాయి..**

తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు.

ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్లు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు.

కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నరమేధ ఉన్మాదం




**మొదటిపేజీ తరువాయి..**

రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. నిందితుడు భార్య, పిల్లలను కూడా హత్య చేయడం పోలీసులను సైతం ఆశ్చర్యానికి గురి చేసిందని సీపీ తెలిపారు.

ఆరుగురిని హత్య చేసిన నిందితుడిని అప్పగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆందోళనకారులు అడ్డుకున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ స్థానికులు నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి షాబాద్ పీఎస్ వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. షాబాద్‌లో బాధితులను కలిసి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సంఘీభావం తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల బంధువులు షాద్‌నగర్-కంది రహదారిపై బైఠాయించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. ఇదిలావుంటే ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ మొత్తాన్ని అందజేస్తామన్నారు. ఈ ఘటనలో షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామన్నారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# బుల్లెట్ రైళ్ళ హబ్‌గా తెలంగాణ



**మొదటిపేజీ తరువాయి..**

కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నైకి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమలో దాదాపు 10 లక్షల మంది నైపుణ్యం కలిగిన ఉద్యోగుల కొరత ఉందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అవకాశాన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశానికి ఎలక్ట్రానిక్స్, ఐటీ, చిప్ డిజైన్ రంగాల్లో ఇప్పటికే బలమైన పునాది ఉందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఇండస్ట్రీ లీడర్ టౌన్ హాల్' సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, బుల్లెట్ ట్రైన్, రైల్వే ఆధునికీకరణ వంటి రంగాల్లో జరుగుతున్న మార్పులను వివరించారు. విద్యార్థులకు సెమీకండక్టర్ డిజైన్‌లో ప్రోత్సాహం అందించేందుకు సైనాప్సిస్, క్యాడెన్స్ వంటి అత్యాధునిక ఏఐ టూల్స్‌ను 315 విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందించినట్లు వెల్లడించారు. విద్యార్థులు స్వయంగా చిప్‌లను డిజైన్ చేసి, మొహాలీలోని సెమీకండక్టర్ ల్యాబ్‌లో వాటిని తయారు చేసి పరీక్షించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో చాలా కొద్ది విశ్వవిద్యాలయాలకే ఇలాంటి సదుపాయాలు ఉన్నాయని అన్నారు.

దేశంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం రెండంకెల వృద్ధిరేటుతో దూసుకెళ్తోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతం ఈ పరిశ్రమ విలువ రూ.13 లక్షల కోట్లకు చేరుకుందని, త్వరలోనే రూ.20 లక్షల కోట్లకు పెరుగుతుందని చెప్పారు. ఈ రంగం ద్వారా ఇప్పటికే 25 లక్షల మందికి ఉపాధి లభిస్తోందని వెల్లడించారు. ఈ మధ్య భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి అయ్యే వస్తువుల్లో మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయని, ఒకప్పుడు పెట్రోలియం, జెమ్స్ అండ్ జ్యువెలరీ ఆధిపత్యం ఉన్నా ఇప్పుడు ఎలక్ట్రానిక్స్ రంగం వాటిని అధిగమించిందని తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం 104 ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థలు పనిచేస్తున్నాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 4 భారీ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను మంజూరు చేసిందని చెప్పారు. హైదరాబాద్‌లో హార్డ్‌వేర్ ప్రోటోటైప్ డిజైన్, టెస్టింగ్, వ్యాలిడేషన్ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.




## మర మనుసులతోటి ఆపరేషన్లు!?

ఆపరేషన్లు ఎవలు శేత్తరు? ఏ తియ్ గిది తెల్వదా? డాక్టర్లే శేత్తరు. మరి గా యంత్రాలే శేత్తే? గిది అంతుశిక్కని ఆలోశనే కదా? గీ మద్దెల మర మనుసులు గదేనుల్లా మనుసుల్లెక్కనే ఉండే రోబోలతోటి ఆపరేషన్లు శేసి చరిత్ర శేసిండ్రు. గదేందంటే...
యూనివర్సిటీ ఆఫ్ క్యాలిఫోర్నియా, శాన్ డియాగో సర్జన్లు,



ఇంజనీర్లు కల్సి గీ క్లీనికల్ ట్రయల్స్ లెక్కల్ల, ఓ రెండు జీవుల మీద గీ పయోగం శేసిండ్రు. ఒక ఆపరేషన్ ను వైద్యుడి సాయంతోటి రోబో శేయగా, మరో ఆపరేషన్ ను రెండు రోబోలు కలిసి శేసినయట. గిది ప్రపంచకంలోనే మొదటిదట. చరిత్ర రాసినట్లు. కనీ, గీ మర మనుసులతోటి ఆపరేషన్లు బాగనే జర్గినా, గిప్పుడిప్పుడే మనుసుల మీద శేయలేమట? ఇంకా పయోగాలు శేసినంక మనుసుల మీద గీ మర మనుసులతోటి ఆపరేషన్లు శేయిత్తరట. ఇచ్చెంత్రం కాకపోతే గిదీన్నేమంటరు?

# యుద్ధం కాదు, శాంతే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి..**

సమయంలో తగిన సమాధానం ఇస్తామని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధ నౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి చేరడం దేశ భద్రతకు మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని జాతికి అంకితం చేసిన ఆయన.. ఇది భారత నౌకాదళ శక్తిని మరింత పెంచే కీలక అడుగని పేర్కొన్నారు. భారత సముద్ర భద్రతలో విశాఖపట్నం కీలక కేంద్రంగా ఎదిగిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రంలో ఏరోస్పేస్, రక్షణ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని ప్రశంసించారు. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా అత్యాధునిక సాంకేతికతపై దృష్టి సారించామని తెలిపారు. ఐదో తరం ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ టెక్నాలజీతో పాటు అండర్‌వాటర్ టార్పెడో వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కర్నూలును దేశంలో ప్రముఖ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ షిప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, పూర్తి స్థాయి నిఘా వ్యవస్థలతో భారత సాయుధ దళాలను ఆధునికీకరిస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కొత్త సాంకేతికత యుద్ధ అవసరాలకే కాకుండా విపత్తుల సమయంలో ఇతర దేశాలకు సహాయం చేయడంలో కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మారిటైమ్ విజన్-2030 అమలులో భాగంగా సముద్ర రంగ అభివృద్ధికి ప్రత్యేక మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. షిప్‌బిల్డింగ్ రంగంలో ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు మరిన్ని అవకాశాలు కల్పిస్తున్నామని, భారత్‌ను ప్రపంచ స్థాయి షిప్‌బిల్డింగ్, మెరిటైమ్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. ప్రపంచ స్థాయి మెరిటైమ్ ఎకోసిస్టమ్ నిర్మాణం దిశగా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. భవిష్యత్తులో యుద్ధాలు కృత్రిమ మేధతో జరుగుతాయని, కానీ దేశం పట్ల ప్రేమ, సుశిక్షితులైన సైనికులు, సమర్థవంతమైన సైనిక సత్తా ఉంటే యుద్ధాలను గెలవవచ్చు అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. భారత రక్షణ, ఏరోస్పేస్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ కొత్త శక్తికేంద్రంగా మారినట్లు ఆయన తెలిపారు. కొత్త టెక్నాలజీలు, సంప్రదాయ విధానాలు ఒకటికి ఒకటి వేరు కాదు అని, ఒకదానిపై ఒకటి ఆధారపడుతాయని, పోటీపడుతాయని, సంప్రదాయ ఎ÷-లాట్‌ఫామ్‌లు లేకుండా.. కొత్త టెక్నాలజీ అసంపూర్ణంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ యుద్ధనౌకలోని 75 శాతానికి పైగా భాగాలు స్వదేశీ సాంకేతికతతో రూపొందించబడ్డాయి. భారతదేశంలోనే వీటిని తయారు చేశారు. భారతదేశ రూపకల్పన సామర్థ్యం, తయారీ నైపుణ్యం, ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం, అలాగే దేశ రక్షణ రంగంలో పెరుగుతున్న స్వదేశీ శక్తికి ఇది సజీవ నిదర్శనమని మంత్రి రాజ్‌నాథ్ అన్నారు. మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లో ఐఎన్ఎస్ మహేంద్రగిరిని నిర్మించారు. బరాక్, బ్రహ్మోస్ వంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలతో సముద్రం, గగనతలంలోని లక్ష్యాలను సమర్థవంతంగా ఛేదించే సామర్థ్యం ఈ యుద్ధనౌకకు ఉందని అధికారులు వెల్లడించారు.

## బంధం మరింత బలోపేతం

**మొదటిపేజీ తరువాయి..**

మధ్య సంబంధాలు స్నేహం, విశ్వాసం, విలువలు, బలమైన భవిష్యత్తు కోసం పరస్పర నిబద్ధతపై నిర్మితమయ్యా యని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు మోదీ. న్యూజిలాండ్ సంప్రదాయంలో విశిష్ట స్థానం కలిగిన 'వాకా'ను గురించి ప్రస్తావిస్తూ.. 'అదో పడవ మాత్రమే కాదని, ఉమ్మడి ప్రయాణానికి చిహ్నం' అని పేర్కొన్నారు. ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న భారతీయ సమాజమే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి నిజమైన నావికులని కొనియాడారు. భారతీయుల ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించే అద్భుత దేశం న్యూజిలాండ్ అని అన్నారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓగా నిఖిల్ రవిశంకర్, గవర్నర్ జనరల్‌గా ఆనంద్ సత్యానంద్, క్రికెట్‌లో రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ వంటి భారత సంతతి వ్యక్తులు రాణించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు.



అలాగే ఆ దేశంలోని పలు ప్రాంతాలకు బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లుండటాన్ని ఇరు దేశాల మధ్య ఉన్న అనుబంధానికి సంకేతమని పేర్కొన్నారు. ఈ దేశంతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని గుర్తుచేసిన మోదీ.. రాజకీయాల్లోకి రాకముందే న్యూజిలాండ్‌ను సందర్శించే అవకాశం వచ్చిందని చెప్పారు. నాడు ఓ న్యూజిలాండ్ వాసి తనకు మఫ్లర్, టోపీ, గ్లౌజులు కానుకగా ఇచ్చిన విషయాన్ని స్మరించుకున్నారు. ఆ మఫ్లర్‌ను ఇప్పటికీ జాగ్రత్తగా భద్రపరుచుకున్నానని, అందులో న్యూజిలాండ్ దేశీయుల ప్రేమనూ అంతే ఆప్యాయంగా కాపాడుకుంటున్నట్టు చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సహా ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. భారత్-న్యూజిలాండ్ బంధాలకు అక్కడి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో వారం రోజుల చరిత్రాత్మక పర్యటనను శనివారం విజయవంతంగా ముగించుకుని భారత్‌కు తిరుగు పయనమయ్యారు. పర్యటన చివరి రోజైన ఇవాళ, దాదాపు 40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో పర్యటించిన తొలి భారత ప్రధానిగా మోదీ సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ఈ పర్యటనలో ఇరుదేశాల సంబంధాలను 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి పెంచుతూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధాని మోదీకి వీడ్కోలు పలికేందుకు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ స్వయంగా విమానాశ్రయానికి రావడం విశేషం. దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. 'ఈ పర్యటన ఇరు దేశాల బంధాన్ని మరింత బలోపేతం చేసింది. భాగస్వామ్యాలను దృఢపరిచింది. ఉమ్మడి భవిష్యత్తుకు పునాది వేసింది' అని పేర్కొంది.

# ఆటలు

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..



## టీమిండియా ఘోర పరాజయం..

### 4-0తో ఇంగ్లాండ్ క్లీన్ స్వీప్.. 56 పరుగులతో పరాజయం

ఇంగ్లాండ్ చేతిలో వరుసగా నాలుగో మ్యాచ్ లోనూ టీమిండియా ఓటమి పాలైంది. శనివారం సౌతాంప్టన్ వేదికగా జరిగిన ఆఖరిదైన ఐదో టీ20లో 56 పరుగులతో పరాజయం పాలైంది.

దీంతో ఐదు టీ20ల సిరీస్ ను 4-0తో ఇంగ్లాండ్ కు చేజార్చుకుంది. ఇక కెప్టెన్ గా పగ్గాలు చేపట్టిన తర్వాత ఆడిన ఏడో మ్యాచ్ ల్లో ఇండియాకు ఇది ఆరో ఓటమి కావడం విశేషం. ఒక మ్యాచ్ లో ఫలితం తేలలేదు. అంతకుముందు ట్రాఫిక్ జాం కారణంగా టీమిండియా స్టేడియంకు ఆలస్యంగా చేరుకోవడంతో టాస్ ఆలస్యమైంది. దీంతో మ్యాచ్ నిర్ణీత వ్యవధి కన్నా లేట్ గా ప్రారంభమైంది. టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 257 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్ లో ఇండియాపై ఇంగ్లాండ్ కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. వికెట్ కీపర్ కమ్ ఓపెనర్ జోస్ బట్లర్ స్టన్నింగ్ సెంచరీ (64 బంతుల్లో 131, 12 ఫోర్లు, 8 సిక్సర్లు) తో చెలరేగాడు. బౌలర్లలో శివమ్ దూబేకు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ లో ఓవర్లన్నీ ఆడిన టీమిండియా 8 వికెట్లకు 201 పరుగులకు మాత్రమే పరిమితమైంది. వన్ డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ సూపర్బ్ ఫిఫ్టీ (35 బంతుల్లో 56, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. బౌలర్లలో శామ్ కరణ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. ఈ మ్యాచ్ లో ఓపెనింగ్ కాంబినేషన్ ఇండియా చేంజ్ చేసినా ఫలితం రాలేదు. వైభవ్ సూర్యవంశీ ప్లేస్ లో వచ్చిన సంజూ శాంసన్ (27) కాస్త వేగంగా ఆడాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (3) త్వరగా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో ఇషాన్ కిషన్ సత్తా చాటాడు. సంజూ తో కలిసి వేగంగా పరుగులు సాధించడంతో ఇండియా చేజ్ లోనే ఉన్నట్లు అనిపించింది. అయితే కీలకదశలో శాంసన్ ను ఔట్ చేసి కరన్ బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28) సమయోచితంగా రాణించి, ఇషాన్ అద్భుత సహకారం అందించాడు. వీరిద్దరూ మూడో వికెట్ కు 55 పరుగులు జోడించడంతో టీమిండియా కోలుకుంది. ముందుగా శ్రేయస్ వెనుదిరగడం, 27 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న ఇషాన్ కూడా ఔటవడంతో ఇండియా బ్యాక్ ఫుట్ లోకి వెళ్లింది. ఈ సిరీస్ లో ఘోరంగా విఫలమైన తెలుగు స్టార్ తిలక్ వర్మ (25 బంతుల్లో 53, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) తో ఫామ్ లోకి వచ్చాడు. ఇషాన్ ఔటైన తర్వాత స్కోరు పెంచే బాధ్యతను తిలక్ తీసుకున్నాడు. వేగంగా ఆడుతూ, స్కోరుబోర్డును పరుగులెత్తించాడు. అయితే మరో ఎండ్ లో శివమ్ దూబే (14), సూర్యాంశ్ షెడ్గే (7) విఫలమయ్యారు. మరో ఎండ్ లో మాత్రం తిలక్ బౌండరీలతో హెరెత్తించాడు. 24 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న తర్వాత తిలక్ ఔటవడంతో ఇండియా పోరాటం ముగిసినట్లయ్యింది. అక్షర్ పటేల్ (3) ఇంపాక్ట్ చూపించలేకపోయాడు.

## లార్డ్స్‌లో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ కౌర్..!

టీమిండియా మహిళల క్రికెట్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చరిత్ర సృష్టించింది. క్రికెట్ మక్కా ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ మైదానంలో మూడు ఫార్మాట్లలో హాఫ్ సెంచరీ చేసిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. ప్రస్తుతం భారత్, ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య ఇక్కడ టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో భాగంగా తొలి రోజు ఆటలో హర్మన్ ప్రీత్ కౌర్ ఈ ఫీట్ సాధించింది. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన నాలుగో ప్లేయర్‌గా ఆమె నిలిచింది. అంతకుముందు మహేల జయవర్ధనే, కుమార సంగక్కర, యూనస్ ఖాన్ ఈ ఘనత సాధించారు.ఇంగ్లాండ్‌తో శుక్రవారం ప్రారంభమైన ఏకైక టెస్ట్‌లో హాఫ్ సెంచరీ చేయడం ద్వారా హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ ఫీట్ సాధించింది. అంతేకాకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో 9వేల పరుగుల మైలురాయిని అందుకుంది. ఈ ఘనత సాధించిన మూడో భారత మహిళా క్రికెటర్‌గానూ ఆమె రికార్డు క్రియేట్ చేసింది. ఈ మ్యాచ్‌లో 13వ పరుగు వద్ద 9000 పరుగుల మైలురాయిని అందుకుంది. మహిళా క్రికెట్ చరిత్రలోనే లార్డ్స్ వేదికగా ఓ టెస్ట్ మ్యాచ్ జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇక మ్యాచ్ విషయానికి వస్తే టాస్ గెలిచిన భారత మహిళల జట్టు కెప్టెన్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా మహిళల జట్టు 285 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 21/1తో నిలిచింది.



## సెమీస్ లోకి దూసుకెళ్లిన స్పెయిన్!

ఫిఫా వరల్డ్ కప్ లో స్పెయిన్ గోల్ కీపర్ ఉనాయ్ సీమోన్ సృష్టించిన ఒక అభేద్యమైన రికార్డ్ గోడ ఫైనల్ గా బద్దలైంది. టోర్నమెంట్ హిస్టరీలోనే మోస్ట్ పవర్‌ఫుల్ రికార్డ్‌గా నిలిచిన 650 నిమిషాల సుదీర్ఘ క్లీన్ షీట్ (గోల్ ఇవ్వకుండా ఉండటం) స్ట్రీక్ కు శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్ లో



బెల్జియం ఎండ్ కార్డ్ వేసింది. మ్యాచ్ 41వ నిమిషంలో బెల్జియం ప్లేయర్ తిమోతీ కాస్టాగ్నే అందించిన క్రాస్ బాల్ ను చార్లెస్ డి కెటెలారే, స్పెయిన్ డిఫెండర్ పావ్ కుబార్సిని దాటుకుంటూ వెళ్లి ఒక మైండ్ బ్లాకింగ్ హెడర్ గోల్ గా మార్చాడు. దీంతో స్కోరు 1-1 తో ఈక్వల్ అయింది. అయినప్పటికీ స్పెయిన్ ప్లేయర్లు ఫుల్ కంబ్యాక్ ఇస్తూ 2-1 తేడాతో బెల్జియంను చిత్తు చేసి నెక్స్ట్ మంగళవారం ఫ్రాన్స్‌తో జరగబోయే బిగ్ సెమీఫైనల్స్ లోకి అఫీషియల్ గా ఎంట్రీ ఇచ్చారు. ప్రెజెంట్ వరల్డ్ కప్ లో లా రోజా కి అగైనెస్ట్ గా గోల్ కొట్టిన ఫస్ట్ టీమ్‌గా బెల్జియం నిలిచింది. దీంతో స్పెయిన్ క్రియేట్ చేసిన వరుసగా ఆరు క్లీన్ షీట్ ల హిస్టారికల్ వరల్డ్ రికార్డ్ ముగిసింది. స్పెయిన్ అన్‌స్టాపబుల్ క్లీన్ షీట్ జర్నీ 2022 లో కతార్ లో జరిగిన వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్ లో మొరాకోతో జరిగిన 0-0 డ్రాతో స్టార్ట్ అయింది. ఆ మ్యాచ్ లో మొరాకో పెనాల్టీ షూటౌట్ లో విక్టరీ కొట్టినా సీమోన్ మాత్రం గోల్స్ ఇవ్వలేదు. ఇక ప్రెజెంట్ వరల్డ్ కప్ టోర్నీ ఓపెనర్ లో కేప్ వర్డేతో జరిగిన మ్యాచ్ లో ఒక సంచలన 0-0 డ్రా తర్వాత, స్పెయిన్ బ్యాక్ టు బ్యాక్ నాలుగు మ్యాచుల్లో క్లీన్ షీట్ విక్టరీలు కొట్టి క్వార్టర్స్ కు క్వాలిఫై అయింది. ప్రత్యర్థి టీమ్స్ కి ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా సీమోన్ చూపించిన డిఫెన్స్ నెక్స్ట్ లెవెల్ లో సాగింది. నాకౌట్ రౌండ్ ఓపెనర్ లో ఆస్ట్రియాపై స్పెయిన్ 3-0 తో ఘన విజయం సాధించిన టైమ్‌లోనే సీమోన్ పాత రికార్డులను బద్దలు కొట్టాడు. అంతకుముందు 1990 లో తన హోమ్ గ్రౌండ్ లో జరిగిన వరల్డ్ కప్ లో ఇటలీ లెజెండరీ గోల్ కీపర్ వాల్టర్ జెంగా వరుసగా ఐదు క్లీన్ షీట్ లతో క్రియేట్ చేసిన 517 నిమిషాల ఆల్ టైమ్ రికార్డును సీమోన్ కంప్లీట్ గా క్రాస్ చేశాడు. 29 ఏళ్ల ఉనాయ్ సీమోన్ ఈ వరల్డ్ కప్ లో మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్‌గా నిలిచాడు. గ్రౌండ్ లో డిఫెండర్లను కోఆర్డినేట్ చేస్తూ గోల్ పోస్ట్ దగ్గర అతను చూపించిన యాక్టివ్ నెస్ స్పెయిన్ విక్టరీస్ లో కీ రోల్ ప్లే చేసింది.సీమోన్ ఈ చారిత్రాత్మక రికార్డుకు పునాది 2022 లో గ్రూప్ స్టేజ్ లో జపాన్ తో జరిగిన 2-1 మ్యాచ్ నుంచి పడింది. అప్పటి నుంచి ప్రెజెంట్ బెల్జియం క్వార్టర్స్ మ్యాచ్ వరకు ప్రత్యర్థులకు ఒక సింహస్వప్నంలా నిలిచాడు. బెల్జియం అతని రికార్డును బ్రేక్ చేసినా స్పెయిన్ టీమ్ గేమ్ ప్లాన్ ను మాత్రం దెబ్బకొట్టలేకపోయింది. అటాకింగ్ లో స్పెయిన్ స్ట్రైకర్లు చూపించిన పవర్ టీమ్‌ను సెమీస్ కు చేర్చింది. నెక్స్ట్ మ్యాచ్ లో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాప్పే అటాక్ ను ఆపడానికి స్పెయిన్ డిఫెన్స్ సరికొత్త ప్లాన్స్ తో రాబోతోందని తెలుస్తోంది.


## తిలక్ వర్మ జట్టుకు భారంగా మారాడు

### మాజీ క్రికెటర్, ఆర్‌సీబీ మెంటార్ దినేష్ కార్తీక్

టీమిండియా టీ20 వైస్ కెప్టెన్, తెలుగు తేజం తిలక్ వర్మపై మాజీ క్రికెటర్, ఆర్‌సీబీ మెంటార్ దినేష్ కార్తీక్ విమర్శలు గుప్పించాడు. తిలక్ వర్మ జట్టుకు భారంగా మారాడని, అతన్ని తొలగించి మరో ప్లేయర్‌కు అవకాశం ఇవ్వాలని సూచించాడు.ఇంగ్లండ్ పర్యటనలో తిలక్ వర్మ పేలవ ప్రదర్శన కనబరుస్తున్నాడు. వరుసగా నాలుగు టీ20ల్లో 13, 24, 3, 11 పరుగులే చేశాడు. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ.. ఆ తర్వాత ఐదో స్థానానికి మారాడు. అప్పటి నుంచే తిలక్ వర్మ పతనం ప్రారంభమైంది. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026, ఐపీఎల్‌లో పర్వాలేదనిపించిన తిలక్ వర్మ.. ఇండియా-ఏ కెప్టెన్‌గా శ్రీలంక పర్యటనలో సత్తా చాటాడు. ఈ ముక్కోణపు వన్డే సిరీస్‌లో ఐదు మ్యాచ్‌ల్లో 55 సగటుతో 275 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. టీ20 టీ20 లీగ్ ఆరంభ మ్యాచ్‌లోనూ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. కానీ ఐర్లాండ్‌తో పాటు ఇంగ్లండ్ పర్యటనలో ఆ జోరును కొనసాగించలేకపోయాడు. నాలుగో టీ20 పరాజయం అనంతరం టీమిండియా ప్రదర్శనపై ఓ స్పోర్ట్ వెబ్‌సైట్‌తో మాట్లాడిన దినేశ్ కార్తీక్.. తిలక్ వర్మతో పాటు శివమ్ దూబేపై విమర్శలు గుప్పించాడు. 'టీమిండియాకు ఉన్న మరో సమస్య తిలక్ వర్మ. అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. భారత్-ఏ తరపున కెప్టెన్‌గా వన్డే ఫార్మాట్‌లో సత్తా చాటినప్పటికీ టీ20 ఫార్మాట్‌లో ఆ జోరును కొనసాగించలేకపోతున్నాడు. చాలా ఇబ్బంది పడుతున్నాడు.

# సినిమా

సమగ్ర తెలుగు దినపత్రిక
అడుగు
The Step Towords The Truth..




## 24న రామాయణ ట్రైలర్ విడుదల

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఇదీ ఒకటి. ఈ మూవీలో రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం ఈ సినిమా ట్రైలర్ విడుదల తేదీని ప్రకటించింది. జులై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ఇన్‌స్టా వేదికగా వెల్లడించింది. కొన్ని వేల సంవత్సరాలుగా ధర్మం, మర్యాద, ధైర్యం, కరుణ అనే ఆదర్శాలతో 'రామాయణం' ఎన్నో తరాలకు స్ఫూర్తినిచ్చింది. మన నాగరికతకు అద్దం పట్టే ఈ గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేయబోతున్నాం అని ఇన్‌స్టాలో చిత్రబృందం పోస్ట్ చేసింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవితో పాటు పలువురు అగ్ర తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా తెలిపారు.

## అఖిల్‌కు హిట్ ఇమ్మని శ్రీవారిని కోరుకున్నా

### లెనిన్ సక్సెస్ మీట్‌లో నాగార్జున

తిరుమల శ్రీవారి దర్శనానికి ఎప్పుడెళ్లినా తాను ఏం కోరుకోనని.. కానీ, ఇటీవల వెళ్లినప్పుడు మాత్రం అఖిల్‌కు మంచి హిట్ ఇవ్వమని కోరుకున్నట్లు నాగార్జున తెలిపారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కించిన 'లెనిన్' తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నాగార్జున మాట్లాడుతూ.. అఖిల్‌కు విజయాన్ని ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో టీమ్ అంతా కలిసి కట్టుగా వర్క్ చేసిందన్నారు. సినిమాకు అడగ్గానే వాయిస్ ఓవర్ ఇచ్చిన మా పెద్దబ్బాయ్ తారక్‌కు ధన్యవాదాలు. సరిగ్గా ఏడాది క్రితం 'తండేల్' సక్సెస్‌మీట్‌కు వచ్చాను. ఇప్పుడు 'లెనిన్' ఈవెంట్.. నాగచైతన్య, అఖిల్ ఇద్దరూ నాకు రెండు కళ్లు. 'లెనిన్' దర్శకుడు మురళీ కిషోర్, ఎడిటర్ నవీన్ ఇద్దరూ పనిరాక్షసులు. భాగ్యశ్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రాన్ని అంగీకరించినందుకు ఆ అమ్మాయికి థాంక్స్ చెప్పాలి. సినిమా విడుదలకు ముందు రోజు రాత్రి భాగ్యశ్రీ ఫోన్ చేసి టెన్షన్ పడింది. తాను ఎంతో కష్టపడుతున్నాననీ కానీ, సరైన గుర్తింపు రావట్లేదని బాధపడింది. 'కష్టానికి తగిన ప్రతిఫలం



కచ్చితంగా వస్తుందని చెప్పా. అదే నిజమైంది. ఈ సినిమా విజయంలో నాగవంశీ ముఖ్యపాత్ర పోషించారని టీమ్‌కు థాంక్స్ చెప్పారు. ఇక అఖిల్ గురించి మాట్లాడుతూ.. ఏది అనుకున్నా దాన్ని కచ్చితంగా సాధించాలనే తపన చిన్నప్పటి నుంచి ఉంది. ఎంతో ఎనర్జిటిక్‌గా ఉంటాడు. ఇప్పటి వరకూ ప్రతి సినిమాకు వందశాతం న్యాయం చేశాడు. కానీ, హిట్ కొట్టలేకపోయాడు. 'లెనిన్'తో సరైన హిట్ పడింది. ఈ సినిమాకు ముందు ఒక ప్రమాదంలో అఖిల్ చేతికి దెబ్బతగిలింది. చాలా రోజులు చేయి పనిచేయలేదు. మళ్లీ మామూలుగా వస్తుందా లేదా అని అందరం టెన్షన్ పడ్డాం. ఆ సమయంలో అఖిల్‌లో చాలా మార్పు వచ్చింది. దేని గురించైనా నిదానంగా ఆలోచించడం నేర్చుకున్నాడు. అదే సమయంలో పెళ్లి అయింది. వాడికంటూ ఓ తోడు వచ్చింది. గుడ్ టైం ప్రారంభమైందనిపించిందని చెప్పారు. అక్కినేని అభిమానులకు నాగార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




### మరో ప్రేమ కథాచిత్రం

## హృదయ మురళి

తమిళ హీరో అథర్వ 'హృదయం మురళి' అనే అనువాద చిత్రంతో బాక్సాఫీస్ బరిలో నిలిచారు. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని హృదయ (అథర్వ) అనే కుర్రాడి కథ ఇది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన అతణ్ని మామయ్య (నట్టి సుబ్రహ్మణ్యం) అన్నీ తానై పెంచి పెద్ద చేస్తాడు. చిన్నప్పుడు స్కూల్లో తన ఇంగ్లీష్ టీచర్ గీత (జోనితా గాంధీ)పై పుట్టిన అమాయకపు క్రష్ నుంచి.. ట్యూషన్‌లో సమంత (ప్రీతి ముకుందన్).. కాలేజీ రోజుల్లో అముద (కయాదు).. ఇలా హృదయ జీవితంలో వివిధ దశల్లో పలు ప్రేమకథలుంటాయి. ప్రతి ఒక్కర్నీ గాఢంగా ప్రేమించినా.. మనసులోని ప్రేమను వ్యక్తపరచలేకపోతాడు. అయితే అదితి (మాళవిక మోహనన్)తో పెళ్లి పీటలెక్కడానికి పదిరోజుల సమయం ఉందనగా.. తన మనసులో దాగి ఉండిపోయిన ప్రేమని వ్యక్తపరిచేందుకు ఫ్రెండ్స్‌తో కలిసి న్యూయార్క్‌కి బయలుదేరుతాడు హృదయ. మరి ఆ తర్వాత ఏమైంది? సరిగ్గా పెళ్లికి ముందు తన గత ప్రేమ జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ హృదయ ఎవరి దగ్గరకి వెళ్లాడు? ఈ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగా నిజమైన ప్రేమని దక్కించుకున్నాడా? సమంత, అముద, అదితిల్లో ఎవరితో కలిసి పెళ్లి పీటలెక్కాడు? అన్నది మిగిలిన కథ. వన్ సైడ్ లవ్‌స్టోరీస్ వెండితెరకు కొత్తేమీ కాదు. అయితే వీటిలో మనసులోని ప్రేమను బయట పెట్టలేక ఒంటరి ప్రేమికులుగా మిగిలిన ప్రేమకథలెప్పుడూ ప్రత్యేకమే. ఈ 'హృదయం మురళి' కూడా ఆ కోవకు చెందిన చిత్రమే. అయితే దీన్ని 90ల నాటి నోస్టాల్జియా మూమెంట్స్‌తో ముడిపెట్టి.. పాత జ్ఞాపకాల్ని గుర్తు చేస్తూ.. ఈతరం ప్రేక్షకులకూ కనెక్ట్ అయ్యేలా వినోదాత్మకంగా తీర్చిదిద్దిన తీరు ఆద్యంతం అలరిస్తుంది. మనసులోని ప్రేమను బయటకు చెప్పలేని ప్రేమికుడిగా హృదయ పాత్రలో అథర్వ ఒదిగిపోయాడు. ఆద్యంతం చక్కని నటనతో కట్టిపడేశాడు. ప్రీతి ముకుందన్ తెరపై అందంగా కనిపిస్తూనే.. చక్కటి అభినయాన్ని చూపించే అవకాశం దొరికింది. ఆమె పాత్రకి ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. అముదగా కయాదు కనిపించినంత సేపూ అలరిస్తుంది. తమన్, నిహారిక, ద్రవిడ్ తదితరుల పాత్రలు కథని ముందుకు తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషించాయి. నేపథ్య సంగీతం సినిమాకి తగ్గట్లుగా కుదిరింది.



### భాగ్యశ్రీ బోర్సే ..భావోద్వేగం

'లెనిన్'లో అఖిల్‌కు జోడీగా భారతి పాత్రలో నటించి ఆకట్టుకున్నారు నటి భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడిందని ఆమె తెలిపారు. తాజాగా ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో భాగ్యశ్రీ మాట్లాడుతూ.. తన అభిమానులు తనను నిరంతరం ప్రోత్సహిస్తూనే ఉన్నారని ఈ చిత్రబృందంతో పాటు వాళ్లందరి వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. హైదరాబాద్ తనకు కర్మభూమి అని చెప్పారు.



## ఓ సుకుమారి ట్రైలర్ విడుదల

'మసూద', 'పరేషాన్' చిత్రాలతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్, టాలెంటెడ్ బ్యూటీ ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ 'ఓ సుకుమారి'. భరత్ దర్శన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్ గుడ్ మ్యూజికల్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అధికారిక ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక అందమైన గ్రామీణ నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథ, ఆ తర్వాత వారి జీవితాల్లో వచ్చే మలుపుల చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. తిరువీర్ తన మార్క్ సహజ నటనతో ఆకట్టుకోగా, ఐశ్వర్య రాజేష్ మరోసారి నటన ప్రాధాన్యమున్న పాత్రలో మెరిశారు. భరత్ మంచిరాజు అందించిన స్వరాలు, నేపథ్య సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. సున్నితమైన భావోద్వేగాలు, చక్కటి వినోదంతో కూడిన ఈ చిత్రం జూలై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Printed, Published & Owned by Margam Rama on behalf of ADUGU DIGITAL MEDIA Pvt. Ltd, Printed and Published at ADUGU PRESS, H No: 7-120, PALAKURTHI Village & Mandal, Jangaon District, Telangana, PIN: 506146. Chief Editor: Dr.Margam Lakshmi Narayana, Ph.No. : 8499990005